క్లుప్తంగా

ఆర్బీకేలో విత్తనాల పంపిణీ



చిలకలపల్లి ఆర్బీకే వద్ద విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సుందరరావు

బలిజిపేట: మండలంలోని చిలకలపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద సర్పంచ్ సుందరరావు ఆధ్వర్యంలో గురువారం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. 1064, పాట్టి మసూరి, 1121రకం విత్తనాలను సబ్సిడీపై అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుందరరావు మాట్లాడుతూ రైతులకు విత్తనాలను సక్రమంగా సరఫరా చేయాలని, గుర్తించిన రైతులెవరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని వేణుగోల స్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన లక్ష్మీనృసింహ స్వామి భక్తులకు గురువారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి. శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రీతికరమైన గురువారం నాడు ప్రత్యేకపూజలు నిర్వహించడానికి స్వామిని అలంకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ భక్తులు దూర ప్రాంతాల నుంచి స్వామివారికి మొక్కులు తీర్చుకునేందుకు రావడం ఆనవాయితీగా వస్తోందన్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

సక్రమంగా భూముల రీసర్వే



భూముల రీసర్వేపై సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ సోమేశ్వరరావు

పాలకొండ: భూముల రీసర్వే సక్రమంగా చేపట్టాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండలంలోని వీఆర్‌ఓలతో సమావేశమైన ఆయన గ్రామాల వారీగా జరుగుతున్న భూముల రీసర్వేపై సమీక్షించారు. సర్వే జరగని ప్రాంతాల్లో సర్వేను త్వరితగతిన ప్రారంభించాలని, సర్వే జరిగే ప్రాంతాల్లో సర్వేను వేగవంతం చేయాలని, సర్వే పూర్తయిన ప్రాంతాల్లో హద్దురాళ్లను పక్కాగా ఏర్పాటు చేయాలని తెలిపారు. విలేజ్ సర్వేయర్లు, వీఆర్‌ఓలు సమన్వయంతో పనిచేసి, గ్రామకంఠాలు, ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. రైతుల సమక్షంలోనే సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ బి.బుచ్చయ్య, సర్వేయర్ పి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఈకేవైసీ నమోదు



ఆన్‌లైన్‌లో ఈకేవైసీ నమోదును పరిశీలిస్తున్న జిల్లా ఉపఖజానా అధికారి మన్మధరావు

కురుపాం: స్థానిక ఉపఖజానా కార్యాలయంలో ఈకేవైసీ నమోదు ప్రక్రియ చాలా చురుగ్గా కొనసాగుతోంది. గురువారం జిల్లా ఖజానా అధికారి ఆరిక మన్మధరావు ఈ ప్రక్రియను పరిశీలించి, ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించి, ఈకేవైసీ ఏ మేరకు పూర్తయిందన్న వివరాలను ఉపఖజానా కార్యాలయం అధికారి కాపు శంకరరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆన్‌లైన్‌లో నమోదైన వివరాలను చూసి, 80 శాతం మేర ఈకేవైసీ పూర్తి కావడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. మిగతా 20 శాతాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపఖజానా కార్యాలయం సీనియర్ అకౌంటెంట్లు అహల్యకుమార్, నాగేంద్రసాయి తదితరులు పాల్గొన్నారు.

35 మద్యంసీసాల స్వాధీనం

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలి వద్ద అక్రమంగా తరలిస్తున్న 35 మద్యంసీసాలను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ కళాధర్ తెలిపారు. ఉదయం కన్నపుదొరవలస గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వీటిని తీసుకువెళ్తుండగా, సిబ్బంది అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రతి ఇంట పండగ వాతావరణం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు మంచి ఆదరణ లభిస్తుందని, అందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలోగల 13వ వార్డు సచివాలయం, 26వ వార్డు వేమకోటి వారి వీధి, కోమటి వీధులలో గురువారం 236వ రోజు గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మొదటి గడప నుంచి చివరి గడప వరకు ప్రతి గడపనా ఆడపడుచులు తమ అభిమాన నాయకుడు ఎమ్మెల్యే జోగారావుకు పూలమాలలు వేసి, హారతులు పట్టి, విజయ కుంకుమ దిద్ది నిండు మనసుతో ఆశీర్వదించి ఆదరించారు. సంక్షేమ పథకాల అమలు తీరును వివరించిన ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అర్హులకు ఏదైనా అన్యాయం జరుగుతుందా తదితర విషయాలు తెలుసుకునేందుకే తాము వచ్చామని వివరించారు. లబ్ధిదారులు సంతృప్తి చెందడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు.

అభివృద్ధిని ఓర్వలేని ప్రతిపక్షాలు

రాష్ట్రప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో అందిస్తుందని ఎమ్మెల్యే జోగారావు చెప్పారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం నిధులను కేటాయించిందని, వాటి ద్వారా పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికి ఏదోఒక సంక్షేమ పథకం అందజేస్తూ పేదల అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తున్న తీరును ఓర్వలేక టీడీపీ, జనసేన నాయకులు కొందరు అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, మాజీ వైస్ చైర్మన్ బెలగాం జయబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ వి.శంకర్రావు, స్థానిక కౌన్సిలర్ సభ్యులు ఎడ్ల త్రినాథ, అర్ చిన్నం నాయుడు, అర్.బంగారు నాయుడు, నిమ్మకాయల సుధీర్, కోరాడ శ్రీనివాసరావు (నాని), పి.జయంతి, ఎస్.లావణ్య, తాడ్డి శంకర్రావు, జేసీఎస్ కన్వీనర్ జి.మాధవరావు, స్టేట్ డైరెక్టర్లు చెవిటి వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, సచివాలయం కన్వీనర్లు బోను ఆదినారాయణ, రెడ్డి రవికుమార్, ఆర్వీఎస్ కుమార్, ఎం.తవిటి నాయుడు, గండి భాగ్యవతి, ఆల్తి విజయ, సామల లలిత, బొంగు సురేష్, బి.నగేష్, కె.చిట్టి, ఎస్. చంద్రరావు, భాస్కరరావు, పి.శ్రీనివాసరావు, రాంబాబు, కార్యకర్తలు, గృహ సారథులు, మున్సిపల్ ఉద్యోగులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విధులకు డుమ్మా కొడితే వేటు

- డ్వామా పీడీ రామచంద్రరావు



మండల కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామచంద్రరావు

సీతానగరం: ఉపాధి హామీ పథకం కార్యాలయం, కార్యాలయేతర సిబ్బంది విధుల్లో అలసత్వం వహించినా వేతన దారులకు అసౌకర్యం కలిగించినా, ప్రజలకు అందుబాటులో లేకపోయినా సత్వర చర్యలు తీసుకోక తప్పదని డ్వామా పీడీ రామచంద్రరావు స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఉన్న ఉపాధిహామీ పథకం మండల కార్యాలయాన్ని సందర్శించి అధికారులు, సిబ్బంది విధులకు హాజరయ్యే సమయాన్ని చూసి తనిఖీ చేశారు. ఉదయం 10 గంటల 20 నిమిషాలు సమయం అవుతున్నా విధులకు హాజరు కాని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఉపాధి పనులు చేయడంలో సమగ్రమైన సమాచారం అధికార సిబ్బంది వద్ద లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశించిన పనులను సిబ్బంది చేయాలని లేనిపక్షంలో విధులనుంచి తప్పుకోవాలని సూచించారు. గ్రామాల్లో పనులను పరిశీలించే అధికారుల వద్ద టూర్‌డైరీ లేకపోవడం, మండలంలో ఎన్ని పనులు జరుగుతున్నాయి? పనులు ఏ స్థాయిలో ఉన్నవీ? ఎంతమంది పనుల్లో పాల్గొంటున్నారో? అడిగి తెలుసుకున్నారు.

క్షేత్ర సహాయకుడిపై సస్పెన్షన్

కార్యాలయంలో రికార్డులను పరిశీలించగా చినభోగిలి క్షేత్ర సహాయకుడు సక్రమంగా విధులు నిర్వహించని కారణంగా తక్షణమే సస్పెన్షన్ విధిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే విధులకు సకాలంలో హాజరుకాని కారణంగా కంప్యూటర్ సహాయకుడిని వీరఘట్టం మండల ఉపాధిహామీ కార్యాలయానికి బదిలీ చేసినట్లు తెలియజేశారు. అందరూ సక్రమంగా విధులు నిర్వహించి మెరుగైన సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఏపీఓ భాను, ఎన్‌ఆర్‌ఈజీఎస్ జేఈ కృష్ణ పాల్గొన్నారు.

ప్రతిగ్రామానికి మంచినీటి సౌకర్యం



ఓవర్‌హెడ్‌ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఏర్పాటు చేస్తున్న మౌలిక సదుపాయాల్లో భాగంగా ప్రతిగ్రామానికి మంచినీటి సౌకర్యం కల్పించడానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. జానుమల్లువలసలో రూ. 20 లక్షల వ్యయంతో ఓవర్‌హెడ్‌ట్యాంక్ నిర్మాణానికి గురువారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం నియోజకవర్గంలో గ్రామాలను అనుసంధానం చేస్తూ నిర్మించిన మట్టి, గ్రావెల్ రోడ్లు కోట్లాది రూపాయల వ్యయంతో బీటీ రోడ్లుగా అభివృద్ధి చేయడం, ఇంటింటి కుళాయిల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అలాగే తాగునీటి సౌకర్యం కల్పించడానికి ఇప్పటికే కె.ఎస్‌పురం, పెదంకలాం గ్రామాల్లో ఓవర్ హెడ్‌ట్యాంక్ నిర్మాణాలు పూర్తి కావడంతో ఇంటింటి కుళాయిల పథకం ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు.

దీర్ఘకాలంగా మంచినీటి సమస్యతో జానుమల్లువలస గ్రామస్తులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం కోసం భూమి పూజ పూర్తయిందని నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసి తాగునీరు సరఫరా చేసేందుకు సిద్ధం చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటనాయుడు, జిల్లా వ్యవసాయ సలహాకమిటీ చైర్మన్ వి.నాగేశ్వరరావు స్థానిక ఎంపీటీసీ వి.ఉషారాణి, ఎంపీపీ ప్రతినిధి బి శ్రీరాములు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతి రావు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు వై.అప్పలనాయుడు, పారినాయుడు, శివున్నాయుడు, బి.ముకుందరావు, బి.సూర్యనారాయణ, ఆర్వీ పార్థసారథి, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు, ఏఈ పవన్ కుమార్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

యువజన శిక్షణ తరగతులు జయప్రదం చేయాలి

పార్వతీపురం: ఈనెల 27 నుంచి 30 వరకు గుంటూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యువజన శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర బాబు కోరారు. ఈ మేరకు గురువారం పార్వతీపురంలో సీపీఐ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



జె.సౌజన్య

వీరఘట్టం: మండల వ్యవసాయాధికారిగా జక్కువ సౌజన్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సిబ్బందికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి, రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

ముమ్మరంగా రథయాత్రకు ఏర్పాట్లు



వేలంపాట నిర్వహిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

పాలకొండ: పట్టణంలో జగన్నాథస్వామి రథయాత్రకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు ఉత్సవాలు చేపట్టేందుకు అధికారులు నిర్ణయించగా, ఉత్సవాల్లో భాగంగా జెయింట్‌వీల్, ప్రసాదాల విక్రయ దుకాణాల ఏర్పాటుకు సంబంధించి, గురువారం వేలంపాట నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన షేక్ అబ్దుల్ ఇమ్రాన్ రూ.1.19 లక్షలకు జెయింట్ వీల్ ఏర్పాటును, బి.సావిత్రి రూ.26 వేలకు ప్రసాదాలు విక్రయించుకునేందుకు అవకాశం దక్కించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.రాధాకృష్ణ తెలిపారు.

123 మందికి ఆరోగ్య తనిఖీలు

కురుపాం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని సచివాలయం -1 సమీపంలో రావాడ రామభద్రపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి, 123 మందికి ఆరోగ్య తనిఖీలు చేశారు. ఎండల తీవ్రత నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యాధికారి చీకటి శంకరరావు వివరించారు.

మున్సిపల్ సేవలు అభినందనీయం



వస్త్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: మున్సిపల్ శాఖ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం గ్రామదేవతల పండగలో విశేష సేవలందించిన మున్సిపల్ సిబ్బందిని గురువారం సన్మానించి అందరికీ వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం పట్టణ ప్రజలకు నిరంతరాయంగా మంచినీరు, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్యం వంటి ముఖ్య సేవలను నిర్విరామంగా నిర్వహించి పట్టణ ప్రజలకు, లక్షల్లో విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పండగను అత్యంత విజయవంతం చేయడంలో తోడ్పాటు అందించారని ప్రశంసించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కె.రుక్మిణి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, ప్రముఖ డాక్టర్ యాళ్ల వివేక్, ఓం శాంతి అమ్మ, రెడ్ క్రాస్ సొసైటీ వ్యవస్థాపకుడు ఎం.శ్రీరాములు, పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు పాకాలపాటి సన్యాసిరావు, జి.వెంకటరమణ, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, పురపాలక సంఘం కమిషనర్, సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యసేవలు



సీతానగరం: చెల్లన్నాయుడువలసలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ ఆశాలత



బలిజిపేట: శివరాంపురంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శశిధర్

సీతానగరం: గ్రామాల్లో అన్నిరకాల వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి మెరుగైన వైద్య సేవలందించడానికి ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానం అవలంబిస్తోందని పెదంకలాం 104 వైద్యాధికారి డాక్టర్ ఆశాలత అన్నారు. ఈ మేరకు గురువారం పెదంకలాం పీహెచ్‌సీ పరిధిలో ఉన్న చెల్లన్నాయుడువలసలో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో 64మంది రోగులకు వైద్య పరీక్షలు, రోగనిర్ధారణ చేసిన అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు గ్రామాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, వైద్య సేవలందించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. పట్టణాల్లోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో అందించే సేవలకు దీటుగా గ్రామాల్లోనే సేవలందిస్తున్నామని తెలియజేశారు. ప్రభుత్వం వైద్య సేవలందించాలనే సంకల్పంతో వైద్యసిబ్బంది సహకారంతో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేయడంతో మెరుగైన వైద్య సేవలు అందించగలుగుతున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

శివరాంపురంలో..

బలిజిపేట: మండలంలోని అరసాడ పీహెచ్‌సీ పరిధి శివరాంపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను అరసాడ పీహెచ్‌సీ వైద్యాధికారి శశిధర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 70మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైద్యసేవలు అందించారు. అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులను పరిశీలించారు. కేంద్రం వద్దకు రాలేని బాధితుల ఇళ్లకు వెళ్లి పరిశీలించి మందులు పంపిణీ చేశారు. వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి శశిధర్ సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం బాల, ఎంఎల్‌హెచ్‌పీ శారద, ఆరోగ్య కార్యకర్త కోటేశ్వరరావు, ఆశ వర్కర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

'రీ'సర్వేలో భాగస్వాములు కావాలి



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీరమణ

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా భూముల సమస్యలను పరిష్కరించడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని తహసీల్దార్ ఎన్వీ రమణ కోరారు. ఈ మేరకు గురువారం మండలంలోని చెల్లన్నాయుడువలసలో భూములు రీసర్వేచేస్తున్న రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ, సర్వే అధికార సిబ్బంది ప్రతిరోజూ భూముల్లో సర్వే చేయడం, భూముల హద్దులను గుర్తించి సర్వే రాళ్లు వేస్తున్నారన్నారు. చెల్లన్నాయుడువలసలో రీ సర్వే జరుగుతున్న భూములున్న రైతులు సర్వే చేస్తున్న సిబ్బందికి సహకరించి తమ భూములకు సంబంధించిన నకళ్లను సమర్పించి తమపేరున నమోదు చేయించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వి.అప్పమ్మ, రీ సర్వే డీటీ పి.చిట్టెమ్మ, మండలసర్వేయర్ శంకరరావు, వీర్వోలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి వెం'బడి'

- విద్యాశాఖపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- పార్వతీపురం నియోజకవర్గంలో మొదటి విడత 100,
- రెండోవిడత 131 పాఠశాలల అభివృద్ధి
- నాడు–నేడు రెండో విడత నిధులు రూ.26.50 కోట్లు విడుదల
- తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణానికి ప్రాధాన్యం



గతంలో పార్వతీపురం ఉన్నత పాఠశాల తరగతి గది



సుందరంగా తయారైన పార్వతీపురం ఉన్నత పాఠశాల తరగతి గది

పార్వతీపురంటౌన్:

మనబడి నాడు–నేడు 2.0కింద ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి శరవేగంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే దాదాపు 50శాతం పనులు పూర్తిచేశారు. పార్వతీపురం నియోజకవర్గంలో అన్ని పాఠశాలలు కొత్త రూపురేఖలు దిద్దుకునేలా అధికార యంత్రాంగం ప్రణాళికలు రూపొందించింది. ఈ మేరకు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తొలివిడత నాడు–నేడు కింద నియోజకవర్గంలో 100 పాఠశాలల్లో రూ.21.71కోట్లతో కార్పొరేట్‌కు మించిన వసతులను సమకూర్చారు. రెండోవిడత నాడు–నేడు కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా 131 ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు రూ. 26.50కోట్లను వెచ్చించింది. ఈ పాఠశాలల్లో పదిరకాల మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు పూర్తి ప్రణాళికలు రూపొందించారు. రెండోవిడత నాడు–నేడు అభివృద్ధి పనులు వేగంగా పూర్తిచేయాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖాధికారులు ఆదేశించారు. ఇప్పటికే నియోజకవర్గంలోని కొన్ని పాఠశాలల అభివృద్ధి పనులను పూర్తిచేశారు.

పేద విద్యార్థుల చదువుకు పెద్దపీట

పేద విద్యార్థుల చదువుపై రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమం, విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు, జగనన్న విద్యాకానుక, వసతిదీవెన, గోరుముద్ద లాంటి పథకాలను విద్యార్థులకు అందజేసి అన్ని విధాలా సహాయం అందజేస్తోంది.అదేవిధంగా నాడు–నేడులో భాగంగా కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో పది రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు.


పాఠశాలలకు సమకూరిన వసతులు

- బాలురు, బాలికలు వేర్వేరుగా మరుగుదొడ్లు
- విద్యార్థులకు బల్లలు, కుర్చీలు, డెస్కులు, గ్రీన్‌చాక్‌బోర్డులు ఏర్పాటు
- రన్నింగ్ వాటర్, ఆర్‌ఓప్లాంట్ల ఏర్పాటు
- అదనపు తరగతి గదుల నిర్మాణం
- తరగతి గదులలో ఫ్యాన్లు, లైట్లు
- ఇంగ్లిష్ ల్యాబ్
- కిచెన్‌షెడ్లు, కాంపౌండ్ వాల్ ఏర్పాట్లు

'జిల్లాలో నాడు–నేడు వివరాలు ఇలా...

మండలం	మొదటి విడత పాఠశాలల సంఖ్య	నిధులు రూ. కోట్లలో	రెండో విడత పాఠశాలల సంఖ్య	నిధులు రూ.కోట్లలో
పార్వతీపురం	37	9.63	55	15.98
బలిజిపేట	27	4.93	42	10.52
సీతానగరం	36	7.15	34	6.37

'నాణ్యతలో రాజీపడం



ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో అన్ని పాఠశాలలకు నాడు–నేడు పథకం ద్వారా అన్నిమౌలిక సుదపాయాలను సమకూరుస్తుంది. ఎక్కడా కాంట్రాక్ట్ వ్యవస్థలేకుండా నాడు–నేడు పనులు తల్లిదండ్రుల కమిటీల ద్వారా చేసేలా చర్యలు చేపట్టింది. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీడకుండా పేరెంట్ కమిటీల సమన్వయంతో పూర్తిచేసి మంచిపేరు తీసుకురావాలి. ప్రతి రూపాయి జాగ్రతగా వినియోగించేలా చర్యలు తీసుకున్నాం. వినియోగించిన ప్రతి రూపాయికి లెక్కచెప్పాల్సిన బాధ్యత తల్లిదండ్రుల కమిటీలు, ప్రధానోపాధ్యాయులపై ఉంది.

– శ్రీనివాసరావు, ఎంఈఓ, బలిజిపేట మండలం

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు గ్రామంలో సీతారామ, ఆంజనేయ, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల ప్రారంభోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహిస్తామని సర్పంచ్ గుంట్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పార్వతీపురం / సాలూరు
9010204441, 9951602891
Office mail : vzmadvt@gmail.com